# లేటు మార్కు




జి. భవానీ కృష్ణమూర్తి

అప్పటికి అరగంటనుంచీ బస్టాండ్‌లో నిలబడి ఉన్నాడు రాజేష్. ఎన్నో బస్సులు వస్తూ పోతూనే ఉన్నాయి గానీ అతనికి కావలసిన బస్ మాత్రం రావడం లేదు. చిరాగ్గా ఉంది. అసహనంగా చేతులు నలుపుకున్నాడు. అర్జంటుగా వెళ్ళాలి. ఆటోలో పోదామంటే జేబు నీరసంగా ఉంది. అయినా తనకంత అదృష్టం కూడానా? ఉహూ! లాభంలేదు. తను టైముకి చేరుకోలేదు. లేట్ మార్క్—

పడాల్సిందే. ఛ! అసలు తన విషయంలో అన్నీ లేటుమార్కులే. తను పుట్టడమే లేటుగా ఐదుగురు పిల్లల తరువాత ఆరోవాడిగా పుట్టాడు. కాలేజీలో చదివే ఆర్థిక స్థోమత లేక ప్రైవేటుగా కట్టి లేటుగా డిగ్రీ తీసుకున్నాడు. ఉద్యోగం కూడా లేటుగానే అంటే డిగ్రీ తీసుకున్న మూడు సంవత్సరాలకి దొరికింది. ఎంత తొందరగా బయలుదేరినా బస్సు దొరికి వెళ్ళేసరికి లేటుమార్కు పడాల్సిందే. రోజూ ఆఫీసరుచేత చివాట్లు తప్పవు. అతనికి చిరాగ్గా, విసుగ్గా ఉంది. కాళ్ళు లాగుతున్నాయి. నిలబడే ఓపికలేక షెల్టరులో ఉన్న సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు. సమయం తొమ్మిదిన్నరే అయినా ఎండ ఎక్కువగానే ఉంది. చమటలతో షర్టు తడిసిపోయింది. గొంతు ఎండిపోయింది. అంతక్రితమే భోజనంచేసినా కడుపులో ఏదో మంటగా, గాభరాగా ఉంది. సోడా తాగుదామనిపించి జేబులు తడుముకున్నాడు. రూపాయిబిళ్ళ బిక్కు బిక్కుమంటూ ఒక మూలకి ఒదిగి ఉంది. బయటికి తీసి చూశాడు. ఇప్పుడు, తిరిగి వచ్చేటప్పుడూ బస్సు ఛార్జీలు పోను మిగిలేవి పదిపైసలు. ఎక్స్ప్రెస్ బస్సు అయితే అవీ మిగలవు. అందులోనూ నెలాఖరు. రూపాయి బిళ్ళని పదిలంగా మళ్ళీ జేబులో దాచుకున్నాడు. ప్రక్కనుంచి నవ్వులు వినిపించి ఆలోచనలు ఆపి అటు తిరిగి చూశాడు. కాలేజీ అమ్మాయిలు కాబోలు కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. తనని చూసే నవ్వుకుంటున్నారేమో నన్న ఫీలింగుతో కుంచించుకుపోయాడు. అసహనంగా లేచి నిలబడి చూశాడు. బస్సు రావడం గమనించి గబగబ ముందుకి నడిచి ఎలాగో తోసుకుంటూ బస్సు ఎక్కాడు.

*　*　*

బస్సు దిగి నీరసంగా ఇల్లు చేరుకునేసరికి ఏడయింది. పెద్దన్నయ్య ముగ్గురు పిల్లలు, చిన్నన్నయ్య నలుగురు పిల్లలు, పురిటికి వచ్చిన అక్కయ్య నలుగురు పిల్లలు, మూడో అన్నగారి ఏకైక పుత్రరత్నం అందరూ కలసి కాట్లకుక్కల్లా పోట్లాడుకుంటూ తమ తమ శక్త్యానుసారం అరుచుకుంటున్నారు. ఇంట్లోకి వెళ్ళకుండా మళ్ళీ ఎక్కడైనా వెళ్ళిపోతే బాగుండు ననిపించింది కానీ, ఎప్పుడు వచ్చినా ఇంతే! గాఢంగా నిట్టూర్చి, మధ్యతరగతి కుటుంబంలో చివరివాడిగా పుట్టడం మహాపాపం, ఇక ఏ జన్మకీ ఇటువంటి శాపాన్ని ప్రసాదించకు స్వామీ అని భగవంతుణ్ణి గట్టిగా ప్రార్థించి లెంపలు వాయించుకుని లోపలి కెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

"వచ్చావురా బాబూ! వెళ్ళి కాళ్ళు, ముఖం కడుక్కుని రా. కాఫీ త్రాగుదుగాని" నీరసంగాధ్వనించింది తల్లి గొంతు.

మాతృవాక్య పరిపాలకు డన్నట్లు వెళ్ళి కాళ్ళు కడుక్కొచ్చాడు. తల్లి ఇచ్చిన కషాయంలాంటి కాఫీని గొంతులో పోసుకుని, కడగంటుతున్న ప్రాణాల్ని తిరిగి తెచ్చుకున్నాడు.

పిల్లల గోలతో చేపల మార్కెట్ గుర్తొచ్చి గట్టిగా అదిలించాడు.

"ఒరేయ్! ఎందుకురా వాళ్ళ నలా కసురుకుంటారు?" అంది తల్లి, మంద లింపు ధోరణిలో.

"లేకపోతే ఏమిటమ్మా, ఎప్పుడు చూసినా ఏదో పోట్లాట, అల్లరి." చిరాగ్గా ముఖం పెట్టాడు.

"బాగుందిరా, అల్లరి పిల్లలు చెయ్యక పోతే మనం చేస్తామా?" అన్నాడు పేపరు చూస్తున్న పెద్దన్నగారు.

"పిల్లల్ని బద్ధశత్రువుల్లా చూస్తాడు. ఇప్పుడు తెలియదులే. వాడికే నలుగురు పుట్టుకొస్తే తెలుస్తుంది" అంది అక్క.

"చాలు తల్లీ ఈ కుచేల సంతానం. ఇంకా నన్ను కూడా ఇలా దీవించకు" చేతులెత్తి దణ్ణం పెట్టాడు.

"అదేమిట్రా అలా అంటావు? పసి పిల్లలు దేముళ్ళతో సమానం" అంది తల్లి.

"నిజమే. పసిపిల్లలు దైవసమానులే కానీ, వాళ్ళ ఆలనాపాలనా చూసే ఓపిక లేక, సక్రమంగా పెంచలేని మనమే రాక్షసులం" ఆవేశంతో గట్టిగా అరిచాడు.

"ఇప్పుడు వాళ్ళకేం లోటు వచ్చిం దిరా?" గట్టిగానే అంది తల్లికూడా.

"అసలు వాళ్ళకి ఉన్నదేమిటి? క్రమ శిక్షణలేదు. చదువు సంధ్యలు లేవు..."

"బాగుంది. పిల్లలకు క్రమశిక్షణ ఏమిటి? స్కూలుకు వెళ్ళి ఏదో చదువు తూనే ఉన్నారుగా"

"ఆ! చదువుతున్నారు" వెటకారంగా అన్నాడు.

"వాళ్ళకు చదువు అంటకపోతే మన మేం చేస్తాం వాళ్ళ ఖర్మ. పిల్లల్ని కంటాము గానీ రాతల్ని కనగలమా?" అంది అక్క సాగదీస్తూ.

"అదిగో, ఆ మూర్ఖత్వమే వద్దం టాను. సక్రమంగా పెంచలేనప్పుడు కనడం ఎందుకు? విధి, ఖర్మ అంటూ మిమ్మల్ని మీరే జోకొట్టుకోవడం ఎందుకు? అదే నాకు నచ్చదు" కసిగా అరిచాడు.

అతనికి చాలా కసిగా ఉంది.

మధ్య తరగతి కుటుంబంలో చివరి వాడిగా పుట్టించిన ఆ భగవంతుని మీద కసి. తన జన్మకి కారకులైన తల్లి దండ్రుల మీద కసి. వారి మూర్ఖత్వంమీద కసి. చేతకానితనం.... వారి అసమర్థత మీద కసి. కడుపునిండా తిననివ్వని అధిక ధరలమీద కసి. ఈ సమాజంమీద, ఈ మనుషులమీద, అందరిమీదా, అన్నిటిమీద.... చివరికి తనమీద తనకే కసి.

"వాడితో నీ కేమిటమ్మా, ఊరుకో,

పెళ్ళయితేగానీ వాడు ఇలాంటి వాగుడు మానడు" అన్నాడు పెద్దన్న.

"నే నసలు పెళ్ళే చేసుకోను" స్థిరంగా అన్నాడు రాజేష్.

"అదేమిట్రా, మొన్న చిన్న మామయ్య వస్తే మాట ఇచ్చేశాముగా" అంది తల్లి విస్తుబోతూ.

"ఎవరితో చెప్పి మాట ఇచ్చారు" గయ్‌మని లేచాడు కోపంగా.

"నీతో చెప్పేదేమిట్రా? ముప్పై ఏళ్లు దాటాయి. అయినా అమ్మకి ఆ మాత్రం స్వతంత్రం లేదా?" అంది అక్క.

"ఈ విషయంలో మాత్రం ఎవరికీ స్వతంత్రం లేదు. ఎన్నేళ్లు వస్తేనేమిటి పెళ్ళాంబిడ్డల్ని పోషించుకునే శక్తి లేనప్పుడు." అసహనంగా అన్నాడు.

"మేమందరం వేలు, లక్షలు సంపాదిస్తున్నామనే పెళ్ళిళ్ళు చేసుకున్నామా? పిల్లల్ని కంటున్నామా?" అన్నాడు అప్పుడే వచ్చిన చిన్నన్న.

"మీరందరూ యంత్రాలు. మనసు, ఆలోచన లేని మరబొమ్మలు. అందుకే పోషించే శక్తి లేకపోయినా పిల్లల్ని కంటూ విధి, ఖర్మ అంటూ వేదాంతం వల్లిస్తున్నారు."

"అంటే.... మేము మా పెళ్ళాంబిడ్డల్ని మాడ్చి చంపుతున్నామా!" కోపంగా అడిగాడు పెద్దన్న.

"ఆ! బాగానే పోషిస్తున్నారు. అర్ధాకలితో వాళ్ళని మాడ్చి చంపుతున్నారు. చదువు సంధ్యలు లేక వాళ్ళు జులాయిలుగా, రౌడీలుగా తిరుగుతుంటే విధి, ఖర్మ అంటూ పలాయనం చిత్తగిస్తారు. ఒక్కడికీ సరిఅయిన బట్టలు లేవు. తాతలనాడు కట్టించిన ఈ ఇల్లుంది కనుక అద్దె బాధ లేదు. అందరం కలిసి ఉంటున్నాము కనుక ఎలాగో సర్దుబాటు అయిపోతోంది. అదే ఒక్కొక్కరూ విడివిడిగా ఉండి చూడండి. మీమీ సంపాదనలతో సంసారాలు ఎలా గడుస్తాయో చూద్దురుగాని. నా జీతంమొత్తం ఇంట్లోనే ఇస్తున్నాను కనుక మీకేం తెలియడం లేదు. పెళ్ళయితే నా పెళ్ళాం పిల్లలూ ఉంటారు. కానీ జీతం మాత్రం ఒక్క రూపాయికూడా అధికంగా రాదు. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన అన్నట్లు అప్పుడు ఈ మాత్రంకూడా తినలేము. ఆ విషయం ఆలోచించకుండా పెళ్ళో పెళ్ళో అని సతాయిస్తారెందుకు? అమ్మా! ముందే చెప్తున్నా, నే నసలు పెళ్ళి చేసుకోను. ఈ విషయంలో మాత్రం ఎవరి బలవంతమూ చెల్లదు" అంటూ వంకీనున్న షర్టునందుకుని 'ఇంత చీకట్లో ఎక్కడికిరా' అని తల్లి పిలుస్తున్నా విని పించుకోకుండా గబగబా వెళ్లి రోడ్డు ఎక్కాడు రాజేష్.

* * *

గమ్యం తెలియని బాటసారిలా ఆ చీకట్లో నడుచుకుంటూ పోతున్నాడు

రాజేష్. ఎవరి ఇంట్లోనోగాని పెళ్ళయిన ట్లుంది. ముందు షామియానా వేసి ఉంది. మామిడాకుల తోరణాలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆ పందిరి కళకళ్ళాడు తోంది. ఆ బిల్డింగుకి ఎదురుగా రోడ్డుకి ఇవతల పక్క చెత్త కుండీలో ఎంగిలి విస్తర్లు దొంతర్లు దొంతర్లుగా పడి వున్నాయి. ముష్టివాళ్ళు, మరో ప్రక్క నుంచి కుక్కలు ఆ విస్తర్లలో మిగిలిన పదార్థాలకోసం కొట్లాడుకుంటున్నారు. పెళ్ళిచేసుకుంటే తన పిల్లలుకూడా తను పెట్టే తిండి చాలక ఇలాగే వీధినపడి కొట్లాడతారు కాబోలు నన్న భావన రాజేష్ వెన్నులో జరజర పాకింది.

గుమాస్తా తండ్రికి తను ఆరవ సంతానం. పెద్ద అన్నకి ముగ్గురు, చిన్నన్నకి నలుగురు, అక్కకి నలుగురు, మూడో అన్నగారికి ఒక్కడు, చిన్నక్కకి ఇద్దరు కలసి కుచేల సంతతిలా ఉంది తమ సంసారం. అక్కలిద్దరికీ పెళ్ళిళ్ళ అయినా పురుడు పుణ్యాలు, రోగాలతో తరచుగా ఇక్కడే ఉంటూ ఉంటారు. అన్నలు ముగ్గురూ అతను సంపాదిస్తున్నా ఇంట్లో అందరూ కడుపు నిండా తినలేకపోతున్నారు. నిత్యావసరాలు తీరడమే చాలా కష్టంగా ఉంటోంది. తను పెళ్లిచేసుకుంటే జనాభా పెరుగుతుంది గానీ, రాబడి పెరగదు. అందుకే పెళ్లి చేసుకోకూడదు అన్న తన నిర్ణయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సడలిపోనివ్వకూడదని శపథం చేసుకుని తిరిగి తిరిగి రాత్రి పది గంటలకి ఇంటికి చేరుకున్నాడు రాజేష్.

* * *

ఈసురోమంటూ లోపల అడుగు పెట్టిన రాజేష్ తల్లితో కబుర్లు చెప్తున్న మేనమామను చూసి గతుక్కుమన్నాడు.

"ఎప్పుడొచ్చావు మావయ్యా?" గత్యంతరంలేక పలకరించాడు.

"మధ్యాహ్నమే వచ్చానోయ్."

"ఇంటి దగ్గర అందరూ కులాసాయేనా?" తల్లి ఇచ్చిన కాఫీ అందుకుంటూ అడిగాడు.

"ఆః కులాసాయే. ఏకంగా ముహూర్తం పెట్టించుకుని మరీ వచ్చాను." ముసిముసిగా నవ్వాడు మావయ్య.

"ముహూర్తం దేనికి మావయ్యా" తెల్లబోయాడు రాజేష్.

"అదేమిట్రా అలా అడుగుతావ్? మావయ్యగారి పద్మని నీకు ఇవ్వడానికి నిశ్చయించామని చెప్పానుగా" అంది తల్లి.

దిగ్గున లేచి నిలబడ్డాడు రాజేష్. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పళ్ళు పటపటా కొరికాడు. మింగేసేలా తల్లి వైపు చూశాడు గానీ మేనమామ ఎదురుగా ఏమనడానికీ నోరు పెగల్లేదు.

"అదేమిటోయ్, అలా నిలబడిపోయావ్" మేనమామ ప్రశ్నకి తడబడి

"అహ.... ఏంలేదు మామయ్యా" అప్రయత్నంగా కుర్చీలో కూలబడ్డాడు.

అవుననలేని, కాదనలేని సంకట పరిస్థితి. తన మనసులోని మాటని నిర్భయంగా అందరి ముందూ చెప్పలేక పోవడం కూడా శాపమే అనిపించిందా క్షణంలో. అందులోనూ చిన్న మేనమామ అంటే మొదటి నుంచీ భయం, బెరుకు. ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. పంజరంలో బంధింపబడినట్లు ఊపిరాడక గిలగిల్లాడసాగాడు.

"ఏమిటోయ్ మాటామంతీ లేకుండా అలా కూర్చుండిపోయావు" మేనమామ పలకరింపుతో తేరుకుని "మాట్లాడాని కేముంది?" అన్నాడు మెల్లగా– తనకే వినిపించనంత మెల్లగా....

అన్నమాట నిలబెట్టుకోలేనందుకు అన్నలు, అక్క ఎగతాళి చేస్తున్న భావన కలిగి తలెత్తి వారివైపు చూడలేక పోయాడు.

తన చేతివేళ్ళనీ, గోళ్ళనీ పరీక్షగా చూసుకుంటూ కూర్చున్నాడు.

"సరే అక్కయ్యా అ ముహూర్తమే ఖాయంచేసేద్దాం. అబ్బాయి మాట్లాడేదేమీ లేదంటున్నాడుగా. అక్కయ్యా! ఎలాగైనా నువ్వు అదృష్టవంతురాలివి."

"నా అదృష్టం అడుక్కు తిన్నట్లే ఉందిలే తమ్ముడూ. ఈ రోజు నీ ముందు ఇంత బుద్ధిగా కూర్చున్నాడు గానీ, ఏనాడయినా నాతో ఇలా సౌమ్యంగా మాట్లాడాడనుకున్నానా?"

అమ్మమీద చెప్పలేనంత కోపం వచ్చింది. మామయ్య ముందు నా పరువు తీసేస్తోంది" అనుకున్నాడు.

"పెళ్ళయి నలుగురు పిల్లలు పుట్టుకొస్తే కుదురు దానంతట అదే వస్తుంది లేవమ్మా" అన్నాడు మామయ్య.

అందరినీ కరకరా నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది. లేచి బయటికి వెళ్లిపోయాడు.

కాళ్ళు నొప్పులు పుట్టేంతవరకూ తిరిగి తిరిగి ఇక నడవలేక ఒక పార్కులోకి వెళ్లి కూర్చున్నాడు.

అతని మనసు పగిలిన అద్దంలా ఉంది. జుట్టు పీక్కున్నాడు.

మావయ్యకి కూడా నలుగురు ఆడపిల్లలు. చివర మగపిల్లవాడు. ఈ పద్మ మూడో పిల్ల. ఆ తర్వాత పిల్ల కూడా పెళ్లికి ఎదిగి ఉంది. నా మీద నమ్మకంతో పాతికేళ్ళు నిండుతున్న పద్మకి వేరే సంబంధం చూడడం మానేశాడు. చిన్నప్పటినుంచీ పద్మ నా కోసమే పుట్టిందని అందరికీ నమ్మకం.

ఇప్పుడు నేను కాదంటే ఆ పిల్లకి ఇంక పెళ్ళికాదు. ఛ! నేను మొదటి నుంచీ చెప్తూనే ఉన్నా మావయ్య నా మాట నవ్వులాటగా కొట్టేసి పద్మకి పెళ్ళిసంబంధాలు చూడడం మానేశారు. మగవాడు పెళ్ళి కాకపోయినా ఈ సమాజంలో నిర్భయంగా బ్రతికెయ్యొచ్చు.

కానీ, ఆడపిల్ల అలా కాదు. పెళ్ళికాని స్త్రీ సమాజపు విషపు కోరలనుంచి తప్పించుకోవడం కష్టం. మరి, పెళ్ళి చేసుకోకూడదన్న తన నిర్ణయం? ఎంతో సేపు తర్జనభర్జనలు జరిగాక చివరికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తేలికపడిన హృదయంతో లేచి మెల్లగా ఇంటిదారిపట్టాడు రాజేష్.


* * *

గదిలోకి అడుగు పెట్టిన పద్మ సిగ్గుతో తల దించుకుని తలుపుదగ్గరే నిలబడింది. రాజేష్ హృదయం 'చూశావా? పెళ్ళి చేసుకోకపోతే ఎంత ఆనందాన్ని మిస్ అయ్యేవాడివో కదూ? గుడ్! ఇప్పటికైనా మొండిపట్టు మాని బుద్ధిగా తలవంచావు" అంటూ అభినందించింది అతన్ని.

మధ్యతరగతి కుటుంబంలోని ఆడ పిల్ల అయినా అపరంజి బొమ్మలా అతి నాజూకుగా ఉంటుంది పద్మ. ఆమెను భార్యగా పొందిన తనెంతో అదృష్టవం తుడు అనుకున్నాడు. అంతవరకూ నిద్రా ణంగా ఉన్న ప్రేమ, కోరిక వెల్లువలా పొంగుకొచ్చాయి.

దగ్గరకు వెళ్ళి "పద్మా" ఆప్యా యంగా దగ్గరకు తీసుకున్నాడు. మెల్లగా నడిపించుకెళ్ళి మంచంమీద కూర్చోబెట్టి "పద్మా! నువ్వు మన్నిస్తానంటే ఒక విషయం చెప్తాను" అన్నాడు.

"ఛఛ! నేను మిమ్మల్ని మన్నించడం ఏమిటి?" బిడియంగా అంది పద్మ.




ఎంతో పరిచయమైనా, ఊహ తెలిసినప్పటి నుంచీ భర్తగా ఊహించుకుంటున్న బావ అయినా తొలిరాత్రి సిగ్గులమొగ్గ కావడం స్త్రీ సహజం కదా!

"అవును పద్మా. ఇది నిజంగా నువ్వు క్షమించవలసిన విషయమే. ఎందుకంటే మనిద్దరం కలసి ఆలోచించుకుని అమలు పరచవలసిన విషయం. కానీ, నేను స్వతంత్రించి అమలుపరిచేశాను." ఆమె ముఖంలోకి చూసే ధైర్యంలేక కిటికిలో

నుంచి బయటికి చూడసాగాడు.

"దేన్ని గురించి?" భయం భయంగా అడిగింది పద్మ.

పద్మా! మన మధ్య తరగతి సంసారం సమస్యలు నీకూ తెలుసు. ముఖ్యంగా మన సంసారాల్లో పెద్దవాళ్ళు మూర్ఖంగా, ఆలోచన, ముందుచూపు లేకుండా పిల్లలను కనేశారు. మా యింట్లో మరీను. దానితో అన్నయ్యలు నేను సంపాదిస్తూ ఉన్నా ఈ కరువు రోజుల్లో ప్రతీదానికీ తడుముకోవడమే. అందుకే నేను అసలు పెళ్ళిచేసుకోకూడదు అనుకున్నాను. మీ నాన్న అంటే గౌరవం అనుకో, భయం అనుకో, ఆయన అభ్యర్థనను తిరస్కరించలేకపోయాను. చిన్నప్పట్నుంచీ నువ్వు నా భార్యవని ముద్రపడిపోయినా నీ మెడలో తాళికట్టే సాహసం ఈనాటి వరకూ చెయ్యలేకపోయాను. ఇప్పుడు కూడా ఇంకా మొండిగా నేను కాదంటే మీ నాన్న నీకు పెళ్లి చేసేసరికి ముసలిదానివైపోతావు నువ్వు. ఈ యింటి పరిస్థితి పూర్తిగా తెలిసినదానివి కనుక నా మాటకి ఎదురు చెప్పవన్న ధైర్యంతో ఈ పెళ్ళికి సిద్ధపడ్డాను. కానీ, పద్మా! మన పిల్లలు ఇటువంటి నరకంలో పెరక్కూడదు. అదొక బంగారు కల. వారికి అందమైన భవిష్యత్తు కావాలి. కానీ, మనం అటువంటి జీవితాన్ని అందించలేము. అందుకే...." ఆగి పద్మ ముఖంలోకి చూశాడు.

"అందుకని–" ఊపిరి బిగబట్టి అడిగింది.

"నేను పిల్లలు పుట్టకుండా అపరేషన్ చేయించుకున్నాను."

"ఏమండీ!"

"క్షమించు పద్మా. నాకు అదే మంచిదనిపించింది. వంశోద్ధారకులు కావాలనుకుంటే అన్నయ్యల పిల్లలున్నారు. వారినే నువ్వు పిల్లలుగా చూసుకోలేవా?" దుఃఖాన్ని దిగమ్రింగుతూ అడిగాడు.

"ఏమండీ!" అతని గుండెల్లో ముఖం దాచుకుంది.

"పద్మా! మన పిల్లలు తిండికి మొహంవాచి, చదువు సంధ్యలు లేక రోడ్లమీద జులాయిలుగా, దొంగలుగా, మంచి బట్టలు లేక ముష్టివాళ్ళలా తిరుగుతూ ఉంటే నీ తల్లిమనసు సహించగలదా?"

"నో.... వద్దు.... వద్దండీ!"

"రోగాలు వస్తే మందులు ఇప్పించే శక్తిలేక వారి చేతుల్లో బూడిద కావలసిన మనం వాళ్ళకి తలకొరివి పెట్టాల్సి వస్తే .... ...." రాజేష్‌ని పూర్తిగా మాట్లాడనివ్వలేదు పద్మ.

"ప్లీజ్! ఇంకేం చెప్పకండి" నోరు గట్టిగా మూసింది.

"ఊహామాత్రానికే ఇంత భయపడేదానివి వాస్తవాన్ని భరించగలవా?"

"నావల్ల కాదు" వణికిపోతోందిపద్మ.

చింపిరిజుట్టు, చినిగిన బట్టలు, దుమ్ము కొట్టుకుపోయిన ఒళ్ళుతో నలుగురు పిల్లలు ముష్టెత్తుకుంటూన్నట్లు ఆమె కళ్ళలో మెదిలింది ఓ భయంకర దృశ్యం. ఆమె ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయింది.

"వద్దు. నేను భరించలేను" కళ్ళు మూసుకుని తలని గట్టిగా రెండు చేతులతో పట్టుకుంది.

"పద్మా! ఇవన్నీ ఆలోచించే నేను .... నేను ఆ పని చేశాను. తప్పా పద్మా?"

"లేదు.... కాదు.... మంచి పని చేశారు."

"థాంక్యూ పద్మా! నా మాటకి విలువ ఇస్తావని తెలిసే నేను ఈ సాహసం చేశాను. పద్మా ! స్త్రీ సహజమైన మాతృత్వాన్ని నువ్వూ కోరుకుంటావని తెలుసు. కానీ, పద్మా! నీలోని ప్రేమని మన ఇంట్లో ఉన్న పిల్లలందరికీ పంచు. వారిని మనుషులుగా తీర్చి దిద్దు. క్రమశిక్షణ అలవాటు చెయ్యి. పద్మా! మన అదృష్టం బాగుండి మన దశ తిరిగి మంచి స్థితి కలిగితే ఎవరైనా అనాధ పిల్లల్ని తెచ్చుకుందాము. అటువంటివారిని ఆదుకుంటే మన కోరికా తీరుతుంది. మన జీవితాలకొక అర్థము, పరమార్థమూ కలుగుతాయి. ఏమంటావు ?"

"చిన్నతనం నుంచీ నేను ఎరిగిన మనిషి అయినా మీలో ఇంతటి విశాల భావాలు నిక్షిప్తమై ఉన్నాయని గ్రహించలేకపోయాను. మీ ఆలోచనల్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తాను. ఈ కుటుంబంలోని పిల్లలు అందరినీ నా పిల్లలుగా ప్రేమిస్తాను, లాలిస్తాను."

"థాంక్యూ పద్మా. నువ్వింత మంచి దానివని తెలియక ఇన్నాళ్ళు మూర్ఖంగా పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాను" అంటూ ఆప్యాయంగా ఆమెని అక్కున చేర్చుకున్నాడు రాజేష్. *

